క్లుప్తంగా

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారుకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: పేదింటి ఆడపచులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి ఓ వరం లాంటిందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజీషాహలోని కార్యాలయంలో మంగళవారం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సైదాబాద్ మండల పరిధిలోని మూసారంబాగ్, సలీంనగర్ శాలివాహననగర్, గడ్డిఅన్నారం, సిరిపురం కాలనీ, ఎల్ఐసీ కాలనీ, గడ్డిఅన్నారం, పూసలబస్తీ, సపోటబాగ్ ప్రాంతాలకు చెందిన 72 మందికి షాదీ ముబారక్, 31 మందికి కల్యాణలక్ష్మి మొత్తం 103 మందికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సైదాబాద్ ఆర్ఐ హరిబాబు, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం


సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ జీపీ ప్రసాద్

సైదాబాద్: పోషకాహారం తినడంతో ద్వారా అందరికీ ఆరోగ్యం సిద్ధిస్తుందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన సైదాబాద్ రెవెన్యూబోర్డు కాలనీలోని సంస్థ కార్యాలయంలో పోషకాహార మాసం–2023ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ పోషణ్–ఉత్తమ జీవన్ అంశంపై కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలిపై సిబ్బందికి వివరించారు. పోషకాహారంపై హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

యాకుత్‌పురాలో బీజేపీ గెలుపు ఖాయం

సైదాబాద్: మార్పు కోరుకుంటున్న పాతబస్తీ వాసులు ఈసారి ఎన్నికల్లో యాకుత్‌పురా నియోజకవర్గంలో బీజేపీని గెలిపించడం ఖాయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన యాకత్‌పురా నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆయన ఐఎస్‌సదన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న తనకు పార్టీ అధిష్టానం అవకాశం కల్పిస్తుందన్నారు.

నేటి నుంచి ఆర్‌కేపురంలో 'గడప గడపకూ బీజేపీ'

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లో గురువారం నుంచి చేపట్టనున్న గడప గడపకూ బీజేపీ కార్యక్రమం విజయవంతం చేయాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ కోరారు. ప్రధాని మంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు 'మేరా మిట్టీ–మేరా దేశ్' కార్యక్రమం విజయవంతం చేయాలని ఆర్‌కేపురం డివిజన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, గురువారం నుంచి చేపట్టనున్న గడప గడపకూ బీజేపీ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం


భాస్కర్

నాగోలు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తిమ్మాయిగూడంకు చెందిన పట్ల భాస్కర్(40) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 3 న తనకు బయట పని ఉందని భార్య అనితకు చెప్పి టాటా ఏస్ వాహనం తీసుకొని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడికి కుటుంబ సభ్యులు ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఇతర ప్రాంతాల్లో విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మంగళవారం రాత్రి భాస్కర్ అన్న వీరస్వామి నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనులు పూర్తికాక ... ముంపు సమస్య తీరక!

- జీఎన్‌రెడ్డినగర్‌లోని క్రిస్టల్ విల్లా వద్ద నిలిచిన వరద నీటి కాలువ పనులు
- వర్షం పడితే చెరువుల్లా మారుతున్న కింది కాలనీలు
- భయాందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు


క్రిస్టల్ విల్లా ముందు అసంపూర్తిగా నిలిచిన వరద కాలువ పనులు

ఎల్‌బీనగర్: భారీ వర్షాల నేపథ్యంలో ముంపు కాలనీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కారం కోసం చేపట్టిన వరద కాలువ పనులు పూర్తి కాకపోవడంతో ఎప్పుడు తమ కాలనీని వరద ముంచెత్తుతుందోనని కాలనీవాసులు భయపడుతున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని సాగర్‌ఎన్‌క్లేవ్, బీఎన్‌రెడ్డినగర్‌లోని క్రిస్టల్ విల్లా వద్ద పనులు పూర్తికాక వరద నిలుస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

క్రిస్టల్‌విల్లా ముందు...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లోని గాయత్రీనగర్ ఫేజ్–4 వద్ద నుంచి క్రిస్టల్ విల్లా వరకు సుమారు రూ.2 కోట్లతో చేపట్టిన వరదనీటి కాలువ పనులు పూర్తయ్యాయి. ఫేజ్–2 పనులు క్రిస్టల్‌విల్లా నుంచి మహాలక్ష్మీనగర్ కాలనీతో పాటు పరిసర కాలనీ నుంచి సాగే వరద నీటి కాలువ పనులకు కొన్ని రోజులుగా అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ కాలువ నిర్మాణాన్ని కొన్ని కాలునీలు వ్యతిరేకించడంతో అధికారులు క్రిస్టల్‌విల్లా వరకు పనులు పూర్తి చేసి అక్కడ నిలిపివేశారు. దీంతో ఆగకుండా 20 నిమిషాల పాటు వర్షం కురిస్తే చాలు...కింది కాలనీలు చెరువుల్లా మారుతున్నాయి. వరద నీటిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్లలోతు గుంతలో నుంచే వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

ఎమ్మెల్యే ఆదేశించినా ఫలితం శూన్యం...

కాలనీలోని ముంపు సమస్య పరిష్కారానికి ఎస్ఎన్‌డీపీ కింద సుమారుగా రూ.1.50కోట్లు మంజూరయ్యాయి. గాయత్రీనగర్ ఫేజ్ 4 నుంచి పాపిరెడ్డికాలనీ మీదుగా నిర్మించిన పనులు పూర్తికాగా రెండోదశ పనులు మాత్రం క్రిస్టల్‌విల్లా వద్ద నిలిచిపోయాయి. ఈ పనులపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇటీవల ఎస్ఎన్‌డీపీ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరగా ఈ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు అధికారులు ఈ పనులను ప్రారంభించలేదు. దీంతో వర్షం వస్తే ఇక్కడి కాలనీలు, రోడ్లు వరద నీటితో చెరువుల్లా మారి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు వరద కాలువ పనులను పూర్తి చేయాలని పలువురు కాలనీ వాసులు కోరుతున్నారు.

కోర్టు కేసులు వల్లే పనులు ఆపేశాం

క్రిస్టల్ విల్లా నుంచి మహాలక్ష్మీనగర్ కాలనీతోపాటు ముంపు ప్రాంతాల వారు ఈ కాలువ పనులు తమ భూముల మీదుగా చేపట్టవద్దంటూ కోర్టుకు వెళ్లారు. దీంతో అక్కడ పనులు నిలిచిపోయాయి. కోర్టు తీర్పు రాగానే పనులు పునః ప్రారంభించి ముంపు సమస్య రాకుండా చూస్తాం.
– పవన్, ఇరిగేషన్ డీఈ

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది


ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న చిలుక మధుర ఉపేందర్ రెడ్డి


చిత్రాలేవుట్ కాలనీలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కాలనీ అధ్యక్షులు నగేష్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డ్ అందుకున్న శేషమ్మను బుధవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి కలిసి అభినందించి శాలువాతో సత్కరించారు. అలాగే, పాఠశాలలోని ఉపాధ్యాయులందరినీ సత్కరించారు. ఈ సందర్భంగా చిలుక మధుర ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించేది ఉపాధ్యాయులని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు మహిపాల్ రెడ్డి, నీక్యాత్ ,కవిత, లక్ష్మీకాంత్, శ్రీదేవి పాల్గొన్నారు.

చిత్రాలేవుట్ కాలనీలో...

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ చిత్రాలేవుట్ కాలనీ నివాసం ఉండే ఉపాధ్యాయులను మంగళవారం రాత్రి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గౌరవ అధ్యక్షుడు రేగట్టే సుధాకర్‌రెడ్డి ఇతర నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మర్రి సత్యనారాయణరెడ్డి, ఆర్గనైసింగ్ సెక్రటరీ కిషోర్‌రెడ్డి, దివాకర్‌రావు, సన్మాన గ్రహీతలు లింగారెడ్డి, రాఘవరెడ్డి, రఘునాథ్, సలీం, విజయలక్ష్మి, జ్యోతి, సరోజ, లక్ష్మి, హైమవతి, రంగారెడ్డి, శంకర్, శ్రీనివాస్, వెంకట రమణ, సుమ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

హస్తినాపురం: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను సత్కరించుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలని హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కాసుల శ్రీనివాస్‌గుప్తా, అధ్యక్షుడు నీలా మధుసూదన్‌గుప్తా అన్నారు. బుధవారం రోజు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న వారిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ప్రధాన కార్యదర్శి బిజ్జాల వేణుగుప్తా, ఉపాధ్యక్షుడు శివయాదగిరిగుప్తా, రవీందర్, మిర్యాలరాజు, చంద్రకోటి, నీలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


హస్తినాపురంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కాసుల శ్రీనివాస్‌గుప్తా

ప్రజలపై పన్నుల భారం తగ్గించాలి: సీపీఎం

హస్తినాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అనేక రకాలుగా పన్నుల భారం మోపుతూ రాజ్యాంగ విరుద్ధంగా దేశాన్ని పాలిస్తోందని ఎల్‌బీగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ఆరోపించారు. బుధవారం హస్తినాపురం చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, వనస్థలిపురం ఎన్‌జీఓస్ కాలనీ చౌరస్తాలలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజలపై కేంద్రం మోపుతున్న పన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్.లక్ష్మన్, ఎ.రామస్వామి, ఎస్.ఎల్లయ్య, లక్ష్మి, ప్రమీల, యమున, మున్నా, ఎస్.యాదగిరి, అంజయ్య, రాములు, కె.మల్లేశ్, సామేలు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామ సర్వే నంబర్–5లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన ఒంటరి, వితంతు, దివ్యాంగ మహిళలు మన్సూరాబాద్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్‌ను కలిసి తమకు ఇళ్ల కేటాయించాలని విన్నవించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల శంకుస్థాపనకు వచ్చిన నాటి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి స్థానికులకు కచ్చితంగా కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆయన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

8న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి


నిరాహార దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న జగన్నాథం గంగయ్య

మన్సూరాబాద్: నాగోలు డివిజన్‌లోని మన్సూరాబాద్ గ్రామ సర్వే నెంబర్ –5లో నిర్మించిన డబుల్ ఇళ్లను ఇక్కడ నివాసముంటున్న పేదలకు కేటాయించాలని కోరుతూ శుక్రవారం సరూర్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు బస్తీ అధ్యక్షుడు జగన్నాథం గంగయ్య తెలిపారు. డబుల్‌బెడ్‌రూం సముదాయాల వద్ద కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద బుధవారం అయన మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా నిరాహారదీక్ష, రిలే నిరహార దీక్ష చేస్తున్నా.. ప్రభుత్వం, అధికార పార్టీ నేతలు స్పందించడం లేదని వాపోయాడు. కార్యక్రమంలో స్వామి, శంకరయ్య, సమ్మయ్య, అంజి, కృష్ణ, విజయ్, పాపమ్మ, వెంకన్న, రామంజీ, వెంకమ్మ, వీరయ్య, శంకరమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో నివసిస్తున్న గుడిసెవాసులకు ప్రభుత్వం అక్కడే పట్టాలు ఇవ్వాలని సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సింగరేణి కాలనీ రోడ్ నం. 14లోని గుడిసెవాసులతో సమావేశమయ్యారు. 30 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న తమ వారిని పలుమార్లు ఇక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. సోమవారం గుడిసెల తొలగింపును అడ్డుకునేందుకు యత్నించిన తమపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. ఎవరు ఎన్నిరకాలుగా ప్రలోభపెట్టినా, కేసులు పెట్టి బెదిరించినా గుడిసెవాసులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని ఆయన అన్నారు.

యూఎల్‌సీ సమస్య పరిష్కారానికి కృషి


సీఎస్ శాంతికుమారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురంలోని పలుప్రాంతాల్లో ఉన్న యూఎల్‌సీ సమస్యను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి యూఎల్‌సీ సమస్యను పరిష్కరించాలని సుధీర్‌రెడ్డి కోరారు. డివిజన్ పరిధిలోని ధాతునగర్‌లో 1505 చదరపు గజాల స్థలం యూఎల్‌సీలో ఉందని, అందులో దాదాపు 470 గజాల స్థలం రెగ్యులరైజేషన్ చేశారని, మిగతా స్థలం రెగ్యులరైజేషన్ చేయకపోవడంతో దాదాపు 254 మంది ఇళ్లకు సెక్షన్22ఏ ప్రకారం రిజిస్ట్రేషన్లు జరగడంలేదన్నారు. దీంతో ఆ స్థలంలో ఇళ్లు కట్టుకోవడానికి అనుమతులు రావడంలేదన్నారు. వెంటనే అధికారులతో చర్చలు జరిపి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సీఎస్‌ను కోరారు. ఈ కార్యక్రమలో ధాతునగర్ కాలనీవాసులు పద్మిని తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో మధుయాష్కి పోటీని స్వాగతిస్తాం

నాగోలు: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం నిరంతరం పోరాటం చేసిన మధుయాష్కి ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడాన్ని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ స్వాగతిస్తుందని కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రా ఏర్పాటు కోసం జాతీయ స్థాయిలో వనరుల పరిరక్షణ కమిటీ పోరాటలు చేసిందని తెలిపారు. మా కమిటీ కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన సోనియా గాంధీ కృతజ్ఞతగా యావత్ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌పార్టీ గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కిందని అన్నారు. ఎల్‌బీనగర్ ఒక్కటే కాదు రాష్ట్రంలోని 118 నియోజకవర్గాలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిట్టా అయిల్‌రెడ్డి, ఎండీ యూసుఫ్‌బాయ్, సుధాకర్, చాడ ఎల్లయ్య, కృపాచారి పాల్గొన్నారు.

'మేరా మిట్టీ - మేరా దేశ్'లో భాగస్వాములు కావాలి

హస్తినాపురం: దేశరాజధాని ఢిల్లీలో పవిత్ర అమృతవాటికను నిర్మించడానికి దేశంలోని ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించేందుకు ప్రతిగడగడపకు బీజేపీ శ్రేణులు తిరుగుతున్నాయని, 'మేరా మిట్టీ– మేరా దేశ్' ప్రచారోద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ద్వారకానగర్ కాలనీలో అమృత కలశ్‌యాత్రను ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా గడగడపకూ వెళ్లి అమృత కలశంతో ఆయన మట్టిని సేకరించారు. కార్యక్రమంలో శాంతిమిత్ర, అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, జీవన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, రాజుగౌడ్, సాయికృష్ణ, పుల్లయ్యచారి, మల్లేష్‌యాదవ్, రాఘవ, గోవర్ధన్ పాల్గొన్నారు.

కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కొలను శివారెడ్డికాలనీ వాసులు

మన్సూరాబాద్: కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని కొలను శివారెడ్డినగర్ కాలనీవాసులు బుధవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొలను నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తిచేయాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలో నిధులు మంజూరు చేయించి పనులు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీవాసులు నందగోపాల్‌రెడ్డి, చంద్రయ్య, జన్నెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌చందర్జీకి మాతృవియోగం

సైదాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ జి.సుభాష్‌చందర్జీ మాతృమూర్తి జి.గంగమ్మ మరణించారు. వయోభారం కారణంగా మంగళవారం సైదాబాద్‌లోని తమ నివాసంలో ఆమె కన్ను మూశారు. మంగళవారం పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి సుభాష్‌చందర్జీని, కుటుంబసభ్యులను పరామర్శించారు. మంగళవారం మధ్యాహ్నం సైదాబాద్ ధోబీఘాట్‌లోని హిందూ శ్మశానవాటికలో గంగమ్మ అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఆర్‌కేపురం నారాయణ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

దిల్‌సుఖ్‌నగర్/నాగోలు: ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో వేడుకలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపిక, రాధ వేషధారణలో అలరించారు. శ్రీకృష్ణుడి లీలపై పాటలు, పద్యాలు పడారు. ఉట్టుకొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

- ఆర్‌కేపురం నారాయణ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఏజీఎం హేముంబర్, ఆర్.ఐ రవిప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ నీరజ,ఏఓ రమేష్, శ్రావణి పాల్గొన్నారు.


రిషినందన్, ఎల్బీనగర్


మలక్‌పేటలో...


మోహన్‌నగర్‌లో..


కొత్తపేటలో...


నివాంత్ శ్రీకృష్ణ, ఎల్బీనగర్


దుర్గాసాయి సాన్విక


వనస్థలిపురంలో...


ఎల్బీనగర్‌లో...


చైతన్యపురిలోని సెయింట్ అలోసియస్ స్కూల్‌లో..

మూసారంబాగ్ బ్రిడ్జిని సందర్శించిన అధికారులు

బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి

మలక్‌పేట: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల నుంచి నీటిని దిగువ ప్రాంతాలకు వదిలారు. దీంతో మూసారంబాగ్ బ్రిడ్జి వద్ద మూసీనదిలో వరద నీటి ఉధృతి పెరిగింది. ధోబీఘాట్‌లోకి వరదనీరు వచ్చి చేరింది.వరద ప్రవాహం బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మలక్‌పేట పోలీసులు బ్రిడ్జిపై మంగళవారం రాత్రి నుంచి రాకపోకలు బంద్ చేశారు. అయితే వరద తగ్గుముఖం పట్టడంతో బుధవారం ఉదయం నుంచి బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు అనుమతించారు. బ్రిడ్జిపై ఎడమవైపు చెత్త, మట్టికుప్పలు పేరుపోగా..ట్రాఫిక్‌ను వాహేద్‌నగర్ వైపు మళ్లించారు. చెత్త, మట్టికుప్పలు తొలగించి తిరిగి మూసారంబాగ్ నుంచి అంబర్‌పేట వైపు వాహనాలను అనుమతించారు. జీహెచ్ఎంసీ సర్కిల్–6, డీసీ జయంత్, సైదాబాద్ రెవెన్యూ అధికారులు, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ గుంజె శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మూసీబ్రిడ్జిని సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. మూసీబ్రిడ్జి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.